సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 22 । జూన్ । 2023



రాజన్నా కరుణించు

వేములవాడ: ఆషాఢమాసం కొనసాగుతున్నప్పటికీ రాజన్నను బుధవారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తుల రద్దీతో కిటకిటలాడింది.



రాజన్న సన్నిధిలో హోమాలు

వేములవాడ: ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా బుధవారం రాజన్న ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం 40.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా చేస్తున్న జడ్జి, తదితరులు

సిరిసిల్లటౌన్: ప్రతీరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎస్.ప్రేమలత అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా డే సందర్భంగా డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ సబ్ కోర్టు జడ్జి శ్రీలేఖ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్, ఏజీపీ రవీందర్‌రావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: మైనార్టీస్ స్టడీ సర్కిల్ ద్వారా అర్హులైన మైనార్టీ నిరుద్యోగులకు యూపీఎస్సీ -సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా అర్హులను ఎంపిక చేస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను పొందుపరచాలన్నారు. జూలై 13లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి 23న అన్ని జిల్లా డ్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత గల మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకోసం 040-23236112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు



రిజర్వాయర్‌లోకి వెళ్తున్న నీరు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తిప్పాపూర్ పంప్‌హౌస్ నుంచి ఒక మోటారు ద్వారా 2800ల క్యూసెక్కుల నీటిని బుధవారం సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎత్తిపోతలు ప్రారంభించినట్లు డీఈఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న సందర్భంగా పంటలకు నీరందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు వారం రోజుల పాటు నీటిని ఎత్తిపోయడం జరుగుతుందని అన్నారు.

23న మినీ జాబ్ మేళా

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్ అపోలో ఫార్మసీ స్టోర్స్‌లో అవసరమైన ఫార్మసిస్టు పోస్టుల కోసం అర్హత కలిగిన అభ్యర్థులకు ఈనెల 23న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10 నుంచి రూ.20 వేలలోపు నెలసరి వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు మేళాకు సంబంధిత సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావచ్చునన్నారు. పూర్తి వివరాలకు 82476 56356 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు అమరుల సంస్మరణ

సిరిసిల్ల: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం అమరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీపీఆర్వో ఎం.దశరథం తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు, నేతన్న చౌక్‌లో అమర వీరుల స్తూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండల కేంద్రాల్లో, గ్రామాల్లోనూ అమర వీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తారని వివరించారు.

రాజన్నకు నాట్యనివేదన



వేములవాడ: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వేములవాడ రాజన్న ఆలయంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కూచిపూడి నృత్యం సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఈవో కృష్ణప్రసాద్, ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు, కళాకారులు పాల్గొన్నారు.



- "కళ్లకు నల్లటి అద్దాలు.. తలకు టవల్ కట్టుకున్న ఈ వృద్ధురాలి పేరు చల్ల వరవ్వ(82). ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన ఈమెకు కళ్లు సరిగా కనిపించక మబ్బులుగా ఉండేవి. ఆమె మనువడు సిరిసిల్లలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి కంటి ఆపరేషన్ చేశారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వరవ్వకు కంటి ఆపరేషన్ జరిగింది. ఇప్పుడు మసకబారిన కళ్లలో అందరినీ బాగా చూడగలుగుతుంది."



- "ఒక్క కన్నుకు ప్లాస్టర్‌తో ఉన్న ఈమె పేరు సందూరి గంగవ్వ(60). వేములవాడ అర్బన్ మండలం మారుపాకకు చెందిన ఈమెకు కళ్లు మబ్బులుగా ఉండడంతో సిరిసిల్లలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో చూపించారు. ఆమెకు అంతర్జాతీయ ప్రమాణాలతో నొప్పి తెలియకుండానే కంటి ఆపరేషన్ చేశారు. కంటి ఆపరేషన్ కోసం రూ.35వేలు గంగవ్వ చెల్లించారు. ఆపరేషన్ అయిన గంటలోపే ఇంటికి వెళ్లారు".

మసకబారిన కళ్లలో ‘వెలుగు’రేఖ



సిరిసిల్లలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల

వైద్యసేవలు వినియోగించుకోవాలి



సిరిసిల్లలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది. సిరిసిల్లలోనే హైదరాబాద్ స్థాయిలో నాణ్యమైన కంటి వైద్య సేవలను ఇస్తున్నాం. ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కంటి జబ్బులతో బాధపడే వారు పరీక్షలు చేయించుకోవాలి.

– బి.అన్వేష్, అడ్మినిస్ట్రేటర్. ఎల్‌వీ ప్రసాద్, కంటి ఆస్పత్రి

- 13 వేల మందికి ఉచిత కంటి వైద్యం
- సిరిసిల్లలో ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆస్పత్రి
- రెండేళ్లలో 46 వేల మందికి కంటి వైద్య సేవలు
- రూ.5 కోట్లతో ఆధునిక వసతులతో భవనం
- మంత్రి కేటీఆర్ చొరవ.. కంటి ఆస్పత్రి చేరువ



ఆస్పత్రిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

నేత్ర వైద్యసేవలు ఇలా..

నిత్యం వచ్చే పేషెంట్లు	90 నుంచి 100
ఇప్పటి వరకు చేసిన కంటిపరీక్షలు	46,000
ఉచితంగా చేసిన కంటి పరీక్షలు	13,000
పేమెంట్‌తో చేసిన కంటి పరీక్షలు	33,000
సిరిసిల్లలో చేసిన కంటి ఆపరేషన్లు	3021

సిరిసిల్ల: ఆర్థికంగా లేని పేద వారికి ఉచితంగా నాణ్యమైన కంటి వైద్యాన్ని, డబ్బులున్న వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో కంటి వైద్యసేవలను సిరిసిల్లలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల అందిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ (క్రిష్ణ సింధూర నేత్ర వైద్య కేంద్రం)ను 2021 ఫిబ్రవరి 21న ప్రారంభించారు. జిల్లాలోని పేదలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన ఆపరేషన్లు చేసేందుకు ఆధునిక వసతులతో సేవలు అందిస్తున్నారు.

రూ.5 కోట్లతో ఆధునిక భవనం

సిరిసిల్ల పట్టణ నడిబొడ్డున ఆర్డీవో ఆఫీస్ సమీపంలో గతంలో ఉన్న డీసీఎంఎస్ గోదాంను తొలగించి ఆ స్థలాన్ని ఎల్‌వీ ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థకు అందించారు. హెటీరో కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్‌ఆర్)లో రూ.5 కోట్లను ఆస్పత్రి భవన నిర్మాణానికి అందించింది. ఈ నిధులతో రెండు అంతస్తుల్లో ఆధునిక వసతులతో కంటి వైద్యపరీక్షలకు, అవుట్ పేషెంట్లు ఉండేందుకు, కంటి జబ్బుల నిర్ధారణకు, సిబ్బందికి రెస్ట్‌రూం, స్టోర్స్ రూం, 20 పడకలతో కూడిన గదులను నిర్మించారు. నలుగురు కంటి డాక్టర్లు ఎం.రోహన్, బిక్రామ్, రేష్మి, శృతి ఉన్నారు. 30 మంది సిబ్బందితో నిత్యం 90 నుంచి 100 మంది అవుట్ పేషెంట్ల(ఓపీ)తో వైద్య సేవలు అందుతున్నాయి. ఆపరేషన్లు అవసరమైన వారికి ఇక్కడే ఆపరేషన్లు చేస్తున్నారు. మరీ అవసరమైన వారిని హైదరాబాద్‌కు రెఫర్ చేయనున్నారు.

మంత్రి కేటీఆర్ చొరవతో..

సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు చొరవతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి దరి చేరింది. జిల్లాలోని పేదలు కంటి సమస్యలతో బాధపడుతూ కామారెడ్డి, కరీంనగర్ శివారులోని రేకుర్తి వంటి ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందేవారు. జిల్లా ప్రజలకు ఆధునిక కంటి వైద్యసేవలు దరి చేర్చాలని లక్ష్యంతో మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి యాజమాన్యం, హెటీరో సంస్థ యాజమాన్యంతో చర్చించి సిరిసిలకు కంటి వైద్యశాల వచ్చేలా చూశారు. అందుబాటులో ఉండాలని భావించి పట్టణ నడిబొడ్డున స్థలం కేటాయించారు. హెటీరో సంస్థ ఆర్థిక సాయంతో వేగంగా ఆస్పత్రి భవనం రూపుదిద్దుకుంది. ఇంకా చిన్న చిన్న పనులు జరుగుతున్నాయి.

ఆలయాల్లో ధూప దీప నైవేద్యం



ప్రొసిడింగ్ కాపీలతో అర్చకులు, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- అగ్రహారం ఆలయంలో దశాబ్ది వేడుకలు

సిరిసిల్ల: రాష్ట్రంలోని ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని రాజన్న సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ కృషితో ఆలయాలు అభివృద్ధి చెందాయన్నారు. తొమ్మిది ఏళ్లలో ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ సర్వమతాలను ఆదుకున్నారని వివరించారు. ఆధ్యాత్మిక పరుడైన కేసీఆర్ దేవాలయాలపై ప్రత్యేక దృష్టితో యాదాద్రిని నిర్మించారని, ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ప్రతినెలా రూ.6 వేలను 2015 జనవరి నుంచి అందిస్తున్నారని గుర్తు చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని 22 మంది అర్చకులకు ధూప, దీప నైవేద్య ప్రొసిడింగ్‌లను ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్, ఆలయ చైర్మన్ గౌరిశెట్టి మహేందర్, ఆలయ ఈవో మారుతి, రెనోవేషన్ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మత్తులో జీవితాలు చిత్తు చేసుకోవద్దు

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్, విద్యార్థులు

సిరిసిల్లక్రైం: మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకొని జీవితాలను చిత్తు చేసుకోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల నేతన చౌక్‌లో డ్రగ్స్ తీసుకోవద్దని అవగాహన కల్పించేందుకు ఫ్లాష్ మాబ్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పునస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలియజేస్తూ డ్యాన్స్, ప్లకార్డ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువత మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి మనేయలేని స్థితిలో ఉన్న వారిని తమ వద్దకి తీసుకువస్తే మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో, కళాశాలలో గంజాయ, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మత్తు పదార్థాలు సేవించే వారి వివరాలను ఎప్పటికప్పుడు డయల్ 100కు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, ఎస్సై లక్ష్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రజిని, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాజుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న దేవరాజు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి అంబేడ్కర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలగందుల దేవరాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంగళవారం రాత్రి అందుకున్నారు. దేవరాజును బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంఈవో దూస రఘుపతి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సహచర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ దేవరాజు మూతపడే పాఠశాలకు జీవం పోశాడన్నారు. విద్యార్థుల సంఖ్య 10 నుంచి 100కు పెంచారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుతున్న దేవరాజు లాంటి ఉపాధ్యాయులకు ఇలాంటి అవార్డులు రావడంతో బాధ్యత మరింత పెరుగుతుందన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

- నాలాల్లో సోఫాలు, పరుపులు వేయడం సరికాదు
- మున్సిపాల్టీల్లో స్వచ్ఛ బడికి రూ.79 కోట్లు
- తీగల వంతెన-మానకొండూరు లైటింగ్‌కు రూ.20 కోట్లు
- కరీంనగర్ అభివృద్ధిపై మంత్రి కేటీఆర్ ప్రశంసల వర్షం
- దసరాకు రివర్ ఫ్రంట్‌పై బతుకమ్మ ఆటలు: మంత్రి గంగుల



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్/కరీంనగర్: ప్రజా భాగస్వామ్యంతోనే నగరాల్లో పరిశుభ్రత సాధ్యమని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్మించిన కౌన్సిల్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నాలాలు శుభ్రం చేస్తుంటే సోఫాలు, పరుపులు, కుర్చీలు వస్తున్నాయని, ఈ తీరు మారాలని సూచించారు. సిద్దిపేట స్ఫూర్తిగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల్లో స్వచ్ఛబడి ఏర్పాటు చేయాలని ఆదేశించామని, ఇందుకు రూ.79 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. తడి చెత్త నుంచి ఎరువు తయారు చేస్తూ హైదరాబాద్ నగరం ఏటా రూ.200 కోట్లు, సిరిసిల్లలో స్వశక్తి సంఘాలు నెలకు రూ.8 లక్షలు సంపాదిస్తున్నాయని వివరించారు. సిద్దిపేటలో దీప్తి అనే కౌన్సిలర్ స్వచ్ఛబడి నిర్వహిస్తోందని, అలా ఇతర కార్పొరేటర్లు ప్రయత్నించాలని సూచించారు. తాను జపాన్ వెళ్లినప్పుడు పరిసరాలు శుభ్రంగా ఉండడంపై ఆరా తీయగా.. తాము అపరిశుభ్రం చేయకపోవడమే కారణమని అక్కడి ప్రజలు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సఫాయిమిత్ర సురక్షలో దేశంలోనే కరీంనగర్‌కు మొదటి స్థానం రావాల్సి ఉన్నా.. కుట్రతోనే ఆ స్థానం గుజరాత్‌కు వెళ్లిందన్నారు.

నేను పుట్టింది కరీంనగర్‌లోనే..

కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కేటీఆర్ సూచించారు. తొమ్మిదేళ్లలో నగరం ఎలా మారిందో ప్రజలు చూస్తున్నారన్నారు. 1976లో తాను ఇక్కడి మిషన్ హాస్పిటల్‌లో జన్మించానని, కరీంనగర్, ఎల్ఎండీలో మూడునాలుగేళ్లు చదివానని గుర్తు చేశారు. నగరంలో పర్యటించినప్పుడు అంతర్గత రోడ్లు చూశానని, చాలా బాగున్నాయని అభినందించారు. రూ.225 కోట్లతో కేబుల్ బ్రిడ్జిని ప్రారంభించుకున్నామని, రూ.480 కోట్లతో నిర్మిస్తున్న రివర్‌ఫ్రంట్ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. మూడు నాలుగు నెలల్లో రివర్‌ఫ్రంట్ పూర్తయిన తరువాత ప్రజలు ఆశ్చర్యపోయే స్థాయికి కరీంనగర్ చేరుతుందన్నారు. వచ్చే సెప్టెంబర్ నాటికి హౌసింగ్‌బోర్డుకాలనీలో 24 గంటల నీళ్లిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టంను ఏర్పాటు చేసుకున్న తొలి నగరం కరీంనగర్ అని తెలిపారు. కౌన్సిల్ హాల్ అసెంబ్లీ హాల్‌లాగా ఉందని ప్రశంసించారు. టీవీల్లో కనిపించాలన్న ఆత్రంతో కొందరు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు దిగజారి దూషణలకు దిగుతున్నారని, ఇది సరికాదని, అందుకే కౌన్సిల్ మీటింగ్‌కు మీడియాను అనుమతించొద్దన్నానని స్పష్టంచేశారు.

లైటింగ్ కోసం రూ.20 కోట్లు

సాయంత్రం మానేరు తీరాన తీగల వంతెన ప్రారంభించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. తీగల వంతెన నుంచి మానకొండూరు వరకు లైటింగ్ కోసం మంత్రి గంగుల కమలాకర్ తనను కోరారని, వెంటనే రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో మానేరు రివర్ ఫ్రంట్ తొలిదశ పూర్తవుతుందన్నారు. శ్రీవేంకటేశ్వర ఆలయం, మెడికల్ కాలేజీలతో జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. వచ్చే దసరా నాటికి రివర్‌ఫ్రంట్‌పై నగర ఆడపడుచులు బతుకమ్మ ఆడుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్‌ను లండన్‌లా మారుస్తానన్న సీఎం కేసీఆర్ తన మాటలను నిజం చేసి చూపించారన్నారు. వచ్చేవారం సింగపూర్, సియోల్ నగరాలకు వెళ్లి పర్యటించి నగరానికి కావాల్సిన సదుపాయాలపై మంత్రి కేటీఆర్‌కు నివేదిక ఇస్తామని వెల్లడించారు. తీగల వంతెన ఆలోచనకు కారణమైన ఈఎన్‌సీ రవీందర్‌రావును ప్రశంసించారు.

ప్రైవేట్ రంగాల్లోనూ రాణించొచ్చు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్ రంగంలోనూ రాణించొచ్చని మంత్రి కేటీఆర్ అన్నారు. రూ.7 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మిస్తున్న మోడ్రన్ లైబ్రరీ భవనానికి శంకుస్థాపన చేశారు. లైబ్రరీలో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడున్న వస్తువు భారతీయులది కాదని, విదేశీయుల వస్తువులు వాడే దుస్థితి మనకు ఉండొద్దని సూచించారు. ఉద్యోగాలు రాలేదని బాధపడొద్దని, మనమే ప్రపంచానికి కొత్త వస్తువులను అందించే స్థాయికి ఎదగాలని సూచించారు. భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా కష్టపడి చదవాలని, ప్రైవేట్ వ్యాపార రంగాలపైనా దృష్టి సారించాలన్నారు. గ్రంథాలయ ఐడీ కార్డును కేటీఆర్‌కు అందించారు. కార్యక్రమాల్లో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, జిల్లా కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కేటీఆర్ పర్యటన సాగిందిలా..

- రూ.10 కోట్లతో నిర్మించనున్న కాశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్, రూ.7కోట్లతో నిర్మించనున్న మోడ్రన్ లైబ్రరీ, నగరపాలక సంస్థ కార్యాలయంలో సిటిజన్ సర్వీస్ సెంటర్, నూతన సమావేశ మందిరం, ఆధునీకరించిన సమావేశమందిరం, కమాండ్ కంట్రోల్ సిస్టంను ప్రారంభించారు.
- కమాండ్ కంట్రోల్ గురించి వివరాలు తెలుసుకున్నారు.
- నూతన కౌన్సిల్ హాల్‌లో మేయర్ యాదగిరి సునీల్‌రావును సీటులో కూర్చొబెట్టి అభినందించారు.



తీగల వంతెనపై క్రాకర్స్ షో



ఓపెన్‌టాప్ జీపుపై తీగలవంతెన చూడటానికి వెళ్తున్న కేటీఆర్



వేదికపై కళాకారుల నృత్యం

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న సబ్ జడ్జి రవీందర్

వేములవాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వేములవాడ సబ్ జడ్జి సట్టు రవీందర్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం వేములవాడ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలసి యోగా చేశారు. యోగాసనాలు చేయడం ద్వారా రిలాక్స్ అవుతారని అన్నారు. కార్యక్రమంలో ఏజీపీ గుడిసె సదానందం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు పాత్తూరి అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, నసీమానసరి, కట్కం జనార్ధన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

వీర్నపల్లి: మండలంలోని గరనపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల మధ్య నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లను బుధవారం విద్యార్థులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఇసుక ట్రాక్టర్లతో ఇబ్బంది కలుగుతుందని అధికారులకు ఎన్నిసార్లు తెలిపిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి ఇసుక ట్రాక్టర్లు పాఠశాలల మధ్య నడవకుండా చూడాలని కోరారు.

ఫెన్సింగ్ తొలగింపుపై ఫిర్యాదు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో తన పంట పొలం ఫెన్సింగ్‌ను తొలగించారని రైతు రేపాక బాల్‌నర్సు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత కక్షతో రహదారిని అక్రమించుకునేందుకు ఈ ఫెన్సింగ్‌ను రాత్రివేళ ల్లో తొలగించారన్నారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరాడు.

దొంగతనం కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు

సిరిసిల్లక్రైం: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసిన దామ పవన్, మదిగాని రవీందర్‌లకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి హిమబిందు బుధవారం తీర్పునిచ్చారు. సిరిసిల్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 23వ తేదీన సిరిసిల్లలోని విశ్వనాథస్వామి ఆలయం హుండీ తాళం పగులగొట్టి దొంగతనం చేయడంతో పాటు ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లిన దామ పవన్‌తో పాటు రవీందర్‌లపై సీఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదే విధానంలో మార్చి నెలలోనూ పలు దొంగతనాలు జరుగడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి పట్టుకున్నారు. ఎస్సైలు శ్రీకాంత్, మారుతిలు కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా వాదోపవాదాల అనంతరం దొంగతనం చేసిన ఇరువురిపై నేరం నిరూపణ కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మార్కెట్‌లోకి ద్రవరూప ఎరువులు

- రైతులకు తగ్గనున్న పెట్టుబడి భారం
- రెండేళ్ల క్రితమే నానో యూరియా, ప్రస్తుతం నానో డీఏపీ
- బస్తాల ఎరువుల కన్నా బాటిల్స్ ఎరువులతో రైతులకు ప్రయోజనం



ద్రవరూప యూరియా, డీఏపీ బాటిల్స్

చందుర్తి (వేములవాడ) : ఎరువుల వినియోగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇంత వరకు బస్తాల్లో ఘనరూపంలో లభించిన ఎరువులు ఇప్పుడు బాటిళ్లలో ద్రవరూపంలో లభించనున్నాయి. నానో ఎరువుల తయారీని భారతీయ ఎరువుల సహకార సంస్థ (ఇఫ్కో)తయారు చేసిన ద్రవ యూరియాను రెండేళ్ల క్రితం మార్కెట్లోకి విడుదల చేసింది. మిగితా కంపెనీలు పోటీ పడి తయారు చేసిన మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీంతో రైతులకు ద్రవరూప ఎరువులతో పెట్టుబడి భారం తగ్గుతుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో నానో యూరియా పేరిట ద్రవరూపంలో లభిస్తోంది. తాజాగా నానో డీఏపీ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1350 ఉండగా, నానో డీఏపీ ధర అర లీటరుకు రూ.600కు విక్రయించనున్నారు. యూరియా సంచి ధర రూ.266 ఉండగా నానో యూరియా ధర అర లీటరు రూ.240 ఉంది. ఇప్పటివరకు బస్తాలో ఉండే డీఏపీ ఎరువును వరినాటు వేసే సమయంలో పొలం మొత్తం చల్లేవారు. కానీ నానో డీఏపీతో ఈ సమస్య ఉండదు. అందుకే రైతులు వీటి వినియోగంపై దృష్టిసారిస్తున్నారు.

రవాణా, కూలీల ఖర్చులు ఆదా

యూరియా బస్తాపై అంతర్జాతీయ ధర రూ.2,450 ఉండగా కేంద్ర ప్రభుత్వం రూ.2,183.50 రాయితీ ఇస్తోంది. ఇది పోను రైతుకు రూ.266కే యూరియా బస్తా లభిస్తుంది. ఇప్పుడు రూ.240కే 500మి.లీ నానో ద్రవ రూప యూరియా సీసా మార్కెట్‌లో లభిస్తోంది. దీంతో రైతుకు రూ.26 ఆదా అవుతుంది. డీఏపీ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.4,073 ఉండగా కేంద్రం ప్రభుత్వం రూ.2,501 రాయితీపై రైతులకు రూ.1,350కే లభిస్తుంది. నానో డీఏపీ అర లీటర్ రూ.600కు లభించగా, ఎరువుల బస్తా ఎంత విస్తీర్ణానికి వినియోస్తామో అర లీటర్ ద్రవ రూపం డీఏపీ అంతే విస్తీర్ణానికి రావడంతో రైతుపై రూ.750 భారంతో పాటు రవాణా, వినియోగం భారం తగ్గుతుంది.

నానో ఎరువుల ప్రయోజనం..

ద్రవరూప ఎరువులు చిన్న పరిమాణం (20–50) ఎంఎం కలిగి ఉండటంతో పంటకు దాని లభ్యత 80 శాతం కన్నా ఎక్కువగా ఉంటుంది. ఇది మొక్కల నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ ఆకుల్లో కిరణ జన్య సంయోగ క్రియను పెంచుతుంది. వేర్లలో కణజలాన్ని వృద్ధి చేస్తుంది. పంట ఉత్పత్తుల పోషక విలువలను పెంచుతుంది.

ఉపయోగించే విధానం

నీటి సమరూపంలో కలుపబడిన మొత్తం నాలుగు శాతం నత్రజని ఉంటుంది. నానో యూరియాలో నత్రజని మొక్కల లోపలి నీటిలో కలిసిన తర్వాత అమ్మోనికల్, నైట్రేట్ ద్రవ రూపంలోకి మారుతుంది. లీటరు నీటికి 2మి.లీ లేదా 4 మి.లీ చొప్పున కలిపి పెరుగుదల దశలో ఆకులపై పిచికారీ చేయాలి. పిలక దశ, పెరుగుదల దశలో, తర్వాత 20–25 రోజులకు పూత దశలో రెండోసారి పిచికారీ చేయాలి.

ఇలా పనిచేస్తాయి...

ఇది ఆకుల రంధ్రాల ద్వారా సులభంగా ప్రవేశిస్తుంది. పంట అవసరాలకు అనుగుణంగా మొక్క వినిమయ ప్రాంతాలకు దారు నాళాల ద్వారా పంపిణీ అవుతుంది. వినియోగించిన నత్రజని మొక్క ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉంటుంది. అవసరమైనప్పుడు మొక్క పెరుగుదల అభివృద్ధి కోసం నెమ్మదిగా విడుదల అవుతుంది.

కష్టం తప్పింది



పంటపొలాలకు యూరియా వేయాలంటే బస్తాను పొలం వరకు తీసుకెళ్లడం కష్టంగా ఉండేది. వర్షాకాలంలో పొలాల వద్దకు తీసుకెళ్లేందుకు దారి సరిగా లేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు బాటిల్ (నానో ద్రవ రూప) యూరియాను తీసుకుపోవడం చాలా సులువు.

– సిరికొండ తిరుపతి, రైతు, చందుర్తి

ఆరుతడి పంటకు నీటిలో కలుపుకుని వినియోగించాం



పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా వేసేందుకు ఎక్కువ సమయం పడుతుంది. యూరియా బాటిల్ రూపంలో రావడంతో దానిని వినియోగించుకోవడం సులువుగా మారింది. బాటిల్ యూరియా కావడంతో భద్ర పర్చుకునేందుకు కూడా ఇబ్బంది ఉండదు.

–చింతపంటి శ్రీనివాస్, రైతు, నర్సింగపూర్

ద్రవరూప ఎరువులతో ప్రయోజనం



ద్రవరూప యూరియా గతంలోనే మార్కెట్లోకి వచ్చింది. మొక్కకు పిచికారీ చేస్తే నత్రజని నేరుగా అందుతుంది. పంటపైరుకు వచ్చే దశలో పిచికారీ చేస్తే దిగుబడి 8 శాతం వరకు పెరుగుతుంది. నానో డీఏపీ అదేస్థాయిలో పనిచేస్తుంది. పెట్టుబడి భారం కూడా తగ్గుతుంది. ఆశించిన మేర ప్రయోజనం ఉంటుంది.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి, రాజన్న సిరిసిల్ల

తొమ్మిదేళ్లుగా దగా పడుతున్న తెలంగాణ

- పీసీసీ కార్యవర్గ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్



మాట్లాడుతున్న నాగుల సత్యనారాయణ

సిరిసిల్లటౌన్: తెలంగాణ రాష్ట్రాన్ని తొమ్మిదేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ దగా చేస్తున్నారని పీసీసీ కార్యవర్గ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ రాష్ట్ర ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని అన్నారు. దళితులు, విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నదాతలు, కార్మికులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ కేసీఆర్ పాలన చేస్తున్నారని విమర్శించారు. నీళ్ల, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో కేసీఆర్ కుటుంబం ఒక్కటే లాభపడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జరిపేది దశాబ్ది ఉత్సవాలు కాదని, దగా వేడుకలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తీరును నిరసిస్తూ తెలంగాణ దగా పేరుతో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజ్, వనిత, మడుపు రశీదేవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఆన్‌లైన్ శిక్షణ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 200 మంది మత్స్యకారులకు జాతీయ మత్స్యకారుల సహకార సమాఖ్య న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్ బుధవారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, వంటి పథకాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

వెంకటాపూర్ క్రషర్ వద్ద ప్రమాదం

- ఒకరికి తీవ్రగాయాలు



గాయపడ్డ శ్రీనివాస్‌కు చికిత్స అందిస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో రెడిమిక్స్ (కాంక్రీట్, సిమెంట్ కలిపే మిషన్) వద్ద లారీ ప్రమాదవశాత్తు వెనక్కి రావడంతో ఓ కార్మికుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రషర్ వద్ద ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బద్దిపడిగ శ్రీనివాస్(40) బుధవారం లారీ వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు లారీ ఒక్కసారిగా వెనుకకు రావడంతో కాలుపై నుంచి టైరు వెళ్లింది. ఎడమకాలు మడిమ వద్ద విరి గి రెండు భాగాలుగా విడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి గాయాలతో ఉన్న శ్రీనివాస్‌కు ప్రథమ చికిత్స అందించి సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



గాయపడిన చిన్నారి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో బుధవారం కుక్కలు ముగ్గురిని తీవ్రంగా గాయపర్చాయి. గాయపడిన సుంకపాక దేవరాజు, అనుషా, దేవయ్యలు వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అయితే కుక్కల బీభత్సం ఎక్కువగా ఉందని ము న్సిపల్ కమిషనర్, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలతో బయటకు వెళ్లాలంటే భయంగా మారిందని అంటున్నారు.

బెదిరించిన వ్యక్తులపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): కులం పేరుతో దూషించి, తుపాకులతో బెదిరించిన వ్యక్తులపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయినపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మామిడి మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన మల్లాపుర కమల వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. ఈనెల 15న ఆమె ఇంట్లో ఉన్న సమయంలో కరీంనగర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, అనంతపల్లికి చెందిన ధర్మయ్య, అతడి అనుచరులు విషాంత్, సాయిలతో పాటు గుర్తు తెలియని మరో ఆరుగురు వ్యక్తులు కమల ఇంటిపై దాడికి వచ్చి కుర్చీలు ధ్వంసం చేసి కులం పేరుతో దూషించారు. మీ కొడుకు చందు ఎక్కడ ఉన్నాడంటూ రెండు తుపాకులతో కమలను, ఆమె భర్తను బెదిరించారు. ఈమేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన తుడం దేవవ్వను బెదిరించిన తుడం గణేశ్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎ స్సై నవత తెలిపారు. దేవవ్వ భూమిలోనికి గణే శ్ అక్రమంగా చొరబడి దూషిస్తూ చంపుతానని బెదిరించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచానికి భారత్ అందించిన వరం యోగా



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్



యోగా సాధనలో స్థానికులు

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వక్తలు

సిరిసిల్లకల్చరల్: పురాణ పురుషులు తమ జీవితాలను రంగరించి రూపొందించి ప్రపంచానికి ప్రసాదించిన అపురూప ప్రక్రియనే యోగ సాధన అని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ప్రధాన వక్తగా సామాజిక సమరసత వేదిక ప్రాంత సమన్వయ కర్త అప్పాల ప్రసాద్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి హాజరై మాట్లాడారు. శరీరాన్ని, మనస్సును లగ్నం చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించేలా రూపొందించిన మహనీయుల కృషి ప్రశంసించారు. వందల సంవత్సరాల పరాయి పాలన కారణంగా మనదైన గొప్ప ప్రక్రియలకు తాత్కాలికంగా దూరం అయ్యామన్నారు. స్వాతంత్ర్య భారతావనికి అమృతోత్సవాలు జరుగుతున్న తరుణంలో ప్రపంచంలో అన్ని దేశాలు యోగా దినోత్సవం జరుపుతూ భారత్‌ను అనుసరించడం విశేషం అన్నారు. త్వరలోనే విశ్వగురువుగా అవతరించనున్న భారత్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. పతంజలి యోగా అసోసియేషన్ సారథ్యంలో వివిధ యోగాసనాలను సాధన చేయించారు. అనంతరం అల్పాహారాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్‌బ్యాంక్ చైర్మన్ గాజుల నారాయణ, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, పత్తిపాక పద్మ, మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, పతంజలి యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎలిగేటి కృష్ణ, పత్తిపాక సురేశ్, ఇతర ప్రతినిధులు గుడ్ల రవి, అడ్డగట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ విధుల్లో వింత ధోరణి

- విధుల కేటాయింపుల్లో అలసత్వం
- ఒకే పాఠశాల టీచర్లకు డ్యూటీ
- నివ్వెరపోతున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రానికి మొదటి సారిగా టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల స్పాట్ కేంద్రం కేటాయించారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు గీతానగర్ పాఠశాలలో స్పాట్ వ్యాల్యూయేషన్ జరుగనుంది. పరీక్షల మూల్యాంకనానికి విధులు కేటాయించాల్సిన నిబంధనలను విద్యాశాఖ పాటించలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఒకే పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ స్పాట్ విధులను కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. వ్యాయమ ఉపాధ్యాయుడు మినహా సదరు పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ పరీక్షల మూల్యాంకనంలో ఉంటే విద్యార్థులకు బోధన చేసేదెవరన్న ప్రశ్న తలెత్తుతుంది. సిరిసిల్లలోని సివిల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ స్పాట్ డ్యూటీ కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు దీంతో ఉపాధ్యాయులు పైఅధికారుల ఉత్తర్వులను కాదనలేక, చెబితే ఎక్కడ శాఖపరమైన చర్యలకు వెళ్తారేమోనని భయాందోళనకు గురవుతున్నారు. విధుల కేటాయింపులను పునఃపరిశీలించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఉపాధ్యాయుల కేటాయింపుల విధానంలో తప్పులు దొర్లినట్లు గమనించామని సరిచేసి అవాంతరాలు లేకుండా చర్యలకు వెళ్తామని పరీక్ష నియంత్రణాధికారి అజీం తెలిపారు.

18 ఆలయాలకు అర్చకుల నియామకం



అర్చకులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆలయాలను సీఎం కేసీఆర్ మెరుగుపరుస్తున్నారని, ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలు ఉండాలని 56 ఆలయాలకు నిధులు మంజూరు చేయడంతోపాటు 18 ఆలయాలకు అర్చకులను నియమించారని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయంలో బుధవారం జరిగిన ఆధ్యాత్మిక ఉత్సవంలో పా ల్గొని రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తున్నారన్నారు. తె లంగాణ సాంప్రదాయ పండుగలకు రూ.75 కోట్లు కేటాయించారని తెలిపారు. ధూప దీప నైవేద్యాలకు రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచారన్నారు. రూ.16 కోట్లతో రాజన్న గుడి చెరువులోకి నీరందించే ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. రూ.18 కోట్లతో బద్దిపోచమ్మకు ఎకరం స్థలం సంపాదించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మ న్ హరిచరణ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీలు మ్యాకల రవి, ఎంపీపీ చంద్రయ్య, కౌన్సిలర్లు యాచమనేని శ్రీని వాస్‌రా వు, బింగి మహేశ్, ఇప్పపూల అజయ్, మా రం కు మార్, జోగిని శంకర్, సిరిగిరి చందర్, నాయకులు పుల్కం రాజు, గూడూరి మధు తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోసం ఠాణా మెట్లెక్కిన వృద్ధుడు

- న్యాయం చేయాలని ఎస్సైకి వేడుకోలు



ఎస్సై నాగరాజుకు సమస్యలు వివరిస్తున్న చంద్రగిరి రాముగౌడ్

వేములవాడరూరల్: రోజురోజుకూ భూముల ధరలు పెరుగుతుండటంతో పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా స్థలాల గొడవలు పెరుగుతున్నాయి. తుదకు ఎన్నో ఏళ్లుగా రహదారిగా ఆ ప్రాంతం గుండా నడవొద్దని అడ్డు వేయడంతో ఆ వృద్ధుడు ఏమి చేయలేక న్యాయం కోసం ఠాణా మెట్లు ఎక్కాడు. వేములవాడరూరల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన చంద్రగిరి రాముగౌడ్ కొన్నేళ్లుగా తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లేవాడు. ప్రస్తుతం ఆ రహదారి ఇప్పుడు లేదని సదరు భూమి యజమానులు అభ్యంతరం చెప్పడంతో రహదారి కోసం ఆ వృద్ధుడు గ్రామంలో అందరికీ విన్నవించుకున్నాడు. ఎవరూ న్యాయం చేయకపోవడంతో ఇక పోలీసులపై ఉన్న నమ్మకంతో బుధవారం వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. వృద్ధ వయస్సుతో పాటు వికలాంగుడిగా ఉన్న ఆయన స్టాండ్ సాయంతో ఠాణా మెట్లు ఎక్కాడు. వృద్ధుడి రాకను గమనించిన ఎస్సై నాగరాజు పెద్ద మనిషిని లోనికి పంపించండి అంటూ అనుమతులు ఇచ్చాడు. ఎండలో వచ్చిన అతడికి మంచినీళ్లు, టీ ఇచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీకు రుణపడి ఉంటా సారూ.. నాకు గ్రామంలో న్యాయం జరగడం లేదు.. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారిని ఇప్పుడు కాదంటున్నారంటూ ఎస్సైని వేడుకున్నాడు. దీనికి స్పందించిన ఎస్సై వెంటనే మీ గ్రామానికి వచ్చి విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వెళ్లిపోయాడు. గతంలో ఎలాంటి గొడవలు జరిగినా పోలీస్‌స్టేషన్‌కు రావాలంటేనే భయపడే ఆ రోజుల్లో నేడు ఏ సమస్యలైనా పోలీసులు సహాయం చేస్తారనే నమ్మకం ప్రజల్లో కలగడంతోనే వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విన్నవించుకుంటున్నారు.

కేటీఆర్ లాంటి నాయకుడిని కోరుకుంటున్నాయి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



ఎల్లారెడ్డిపేటలో పూజలు చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రపంచ దేశాలు మంత్రి కేటీఆర్ లాంటి నాయకుడు మాకు కావాలని కోరుకుంటున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేటలోని షిర్డీసాయిబాబా, శ్రీవేణుగోపాలాస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. తలసరి ఆదాయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఓ మూలకుండేదని, సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా మారిందన్నారు. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమం, మరోవైపు ఆధ్యాత్మికంగా యాదాద్రిలో నృసింహస్వామి దివ్య క్షేత్రాన్ని నిర్మించారని తెలిపారు. ప్రపంచమే అబ్బురపడేలా ఒక గొప్ప ఆలయాన్ని నిర్మించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ నాగరాణి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు సీత్యానాయక్, మెండె శ్రీనివాస్, మల్లేశంగుప్తా, మీసం రాజం, బందారపు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: డబుల్ బెడ్రూం ఇళ్లను డ్రాలో ఎంపికైన వారికి తొందరగా పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి నెలలు గడుస్తున్నా పంపిణీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. డబుల్‌బెడ్రూం రాని లబ్ధిదారులకు రూ.3లక్షలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ ఈనెల 23న మున్సిపల్ కార్యాయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, సదానందం, సూరం పద్మ, లక్ష్మణ్, పోచమల్లు, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

బల్దియా తీరుపై అన్నదాతల ఆందోళన



కందకాలను అడ్డుకుంటున్న రైతులు



పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతు

- నోటీసులు ఇవ్వకుండా రైతుల భూముల్లో కందకాలు
- పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన

సిరిసిల్లఅర్బన్: తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూముల్లో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు కందకాలు తీస్తున్నారని బాధిత రైతులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని సిరిసిల్ల రెండో బైపాస్ సమీపంలోని సర్వే నం.405లో రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో మున్సిపల్ అధికారులు కందకాలు తీసి, హద్దురాళ్లను ఏర్పాటు చేయడంతో రైతులు వారిని అడ్డుకున్నారు. దీంతో రైతులకు బల్దియా అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. దాదాపు 60 ఏళ్ల క్రితం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, నాటి నుంచి నేటి వరకు ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా కందకాలు తీస్తున్న వారిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. వరి నారును కూడా ధ్వంసం చేసినట్లు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని బోయిని రాములు అనే రైతు మందు డబ్బా చేత పట్టుకొని బల్దియా తీరుపై నిరసన వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

బ్యాంక్ దోపిడీకి యత్నించిన దొంగ రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకులోకి చొరబడి దోపిడీకి యత్నించిన దుమాల గ్రామానికి చెందిన పిల్లి చందును బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. బ్యాంక్‌లో దోపిడీకి యత్నించిన చందును 24 గంటల వ్యవధిలో పట్టుకున్నామని అన్నారు. దొంగతనంపై పూర్తిస్థాయి విచారించి కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించినట్లు తెలిపారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు తప్పకుండా తగిన జాగ్రత్తలతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.